ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

# ప్రాచీన జానపద కళారూపం – బుర్రకథ

డాక్టర్ పప్పల వెంకటరమణ
ఎం. ఏ., పి హెచ్.డి. (గోల్డ్ మెడల్)
ఆంధ్రోపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు), శ్రీకాకుళం
చరవాణి: 9491812710.

Article Received: 20/12/2024 Article Accepted: 16/01/2025 Published Online: 22/01/2025
DOI:10.53414/Sahithyatharangini.2025.2105

**వ్యాస సంగ్రహం:** జానపదుల ఆదరాభిమానములను ఇంతగా చూరగొన్న ఈ బుర్రకథలు ప్రాచీన కాలంలో జంగం కథలుగా వర్ధిల్లేను. ఈ కళారూపం నేడు బుర్రకథని, తంబురా కథని, తందాన కథని, గుమ్మెట్ల కథని రకరకాల పేర్లతో పిలువబడుతుంది. జానపదమంటే పల్లెటూరని, జనపదంలో నివసించే వారిని, వారు పాడుకునే పాటలనే జానపద కళారూపాలని అందురు. ప్రాచీన కళారూపాలలో బుర్రకథ ప్రధానమైనది. ఇది జానపదులకు విజ్ఞాన వినోదములతో పాటు మానసిక ఆనందమును కలిగించును.

జానపద కళలు అతి ప్రాచీనమైనవి. మానవుల యొక్క అనుభూతులకు, మానసిక చైతన్యానికి, విజ్ఞాన వినోదాలకు, ఆనందోత్సవాలకు ప్రతీకలై నిలిచాయి. వీటిపై సమగ్ర పరిశోధన చేసి రాబోయే తరాలకు ఈ కళారూపాల విశిష్టతను తెలియపరచడమే ఈ పరిశోధన ఫలితము.

సర్వ కళల పరమ ప్రయోజనం ఆనందోపదేశములు. ప్రాచీన కళారూపాలను పునరుద్ధరించి ప్రగతిశీల దృక్పథంతో, నూతన ప్రయోగంతో, ఆధునిక పద్ధతులలో ప్రజల మధ్యకు తీసుకుపోవాలని, అంతరించిపోతున్న కళలకు ఊపిరి పోయాలనే ప్రయత్నం చేయడమే వ్యాసకర్త ప్రధాన ఉద్దేశ్యము.

**కీలక పదాలు:**. ఆచార వ్యవహారాలు, అస్తిత్వం, పాశ్చాత్య సంస్కృతి, మఠాధిపతులు, సంఘవిద్రోహులు, యక్షగానం, కొరవంజి, విదూషకుడు, తంబురా, క్రీడాభిరామం.

**ఉపోద్ఘాతం:** ఆంధ్ర దేశంలో ఆనాటి నుండి ఈనాటి వరకు బహుళ ప్రజాదరణ పొందిన ప్రాచీన కళారూపం బుర్రకథ. ఒకనాడు మత ప్రభోదానికి, దేశభక్తికి ప్రతిబింబంగా నిలబడిన జంగం కథా కళారూపం రానురాను యాచనకు, ఉదర పోషణకు ఉపయోగపడి తిరిగి ఈనాడు దేశభక్తిని ప్రబోధిస్తూ, ప్రజా సమస్యలను చిత్రిస్తూ బుర్రకథగా స్థిరపడిపోయి ప్రజాదరణ పొందినది.

అనేక విధాలుగా ప్రజలలో వినిపిస్తున్న బుర్రకథలు భరతుడు నిర్వచించిన కొరవంజి. యక్షగానాల నుండి గాంధర్వ గానములు ఉద్భవించాయని మనం అర్థం చేసుకోవచ్చు. పై ఉదాహరణలు బట్టి మన జంగం కథలు, బుర్రకథలు, కొరవంజి, యక్షగానము మొదలైనవి అనేక దశలను దాటి నేటి సంగీత కళారూపంగా బుర్రకథ నిలబడిందని చెప్పుకోవచ్చు.

**బుర్రకథ ఒక జానపద కళారూపం.** ఇందులో పల్లె పదాలు, వంత హాస్యాలు, బిగువైన కథనాలు, పద్యాలు, పాటలు అన్నిటినీ కలుపుకుంటూ సరదా సరదాగా సాగిపోయే కళారూపం. పరిమితమైన ఆహార్యంతో, ఆడుతూ పాడుతూ హాస్యోక్తులు పలుకుతూ జన సామాన్యానికి చేరువుగా వెళ్లే కళారూపాలలో బుర్రకథ పూర్తిగా జానపద కళారూపం.

రెండవ ప్రపంచ యుద్ధం సృష్టించిన తీవ్ర సంచలనంలో ప్రతి కళాకారుడు దేశభక్తి ప్రపూరితుడైపోయాడు. కవులు గేయాలు వ్రాశారు. గాయకులు కంఠాలెత్తారు. ఆంధ్ర ప్రజా సామాన్యన్నంతా గాఢ నిద్రలోమేల్కొలిపారు. ఆనాడు దేశంలో వచ్చిన రాజకీయ కల్లోల వాతావరణం లో ఏర్పడింది ప్రజానాట్యమండలి. ఉత్సాహం కొద్ది నిర్మించింది కాదు. అది ఒక అద్భుత వాతావరణంలో జన్మించింది.

కళ కళ కోసం కాదని, అది ప్రజల కోసమని నిరూపించింది. కళ వ్యక్తుల సొత్తు కాదని, అది ప్రజలకు చెందిన ఆస్తి అని చాటింది. ప్రజల యొక్క స్థితిగతులకు అనుకూలంగా వారి కష్టాలలో పాలుపంచుకుని పరిష్కార మార్గాలను కళారూపాల ద్వారా పరిష్కరించింది.

ప్రాచీన కళారూపాలన్నిటిని పునరుద్ధరించారు. కళారూపం పాతదైనా ప్రస్తుత ఇతివృత్తాలను చేర్చి, ఆ కళారూపాల స్థాయిని, రూపాన్ని మార్చి కొత్త మెరుగులు తీర్చిదిద్దారు. ఒక్కొక్క కళారూపానికి ఒక్కొక్క ప్రజా సమస్యను ముడిపెట్టారు. అలా మనకున్న ప్రాచీన జానపద కళారూపాల్లో ప్రథమంగా ప్రారంభించిన కళారూపం బుర్రకథ.

**ప్రధాన విషయం:** ప్రజా హృదయాలను బాగా చూరగొన్న ప్రాచీన కళారూపం బుర్రకథ. ఈ బుర్రకథల యొక్క పూర్వ చరిత్ర మనకు సరిగా తెలియడం లేదు. జంగం కథగా వర్ధిల్లిన ఈ కళారూపం నేడు బుర్రకథ అని, తంబురా కథని, తందాన కథని, గుమ్మెట్ల కథని అనేక ప్రాంతీయ భేదాలతో పిలువబడుతూ ఉంది.

మొత్తం మీద చూస్తే బుర్రకథలో ముఖ్య కథకుడు గంభీరమైన కథకుడైతే, హాస్యగాడు హాస్యం చేస్తాడు. రాజకీయం చేసే వ్యక్తి చేయాల్సిన పని సమతుల్యత సాధించడం. "కథకుడికి వత్తాసు పలుకుతూ కథ తాలూకు విలువని గాంభీర్యాన్ని కాపాడడం, ప్రేక్షకుల ఆసక్తిని కాపాడేందుకు హాస్యగాడితో కలిసి హాస్య చర్చలో పాలుపంచుకోవడం రెండింటిని జాగ్రత్తగా నిర్వహిస్తాడు".

కృష్ణా గుంటూరు జిల్లాలలో ఈనాడు జంగం కథలు అంటే చాలామందికి తెలియదు. బుర్రకథ అనే పేరు ఆ బాలగోపాలానికి తెలుసు. అలాగే రాయలసీమ జిల్లాలలో బుర్రకథ అంటే ఎవరికి తెలియదు. అక్కడ 'తందాన కథ' అనే వ్యవహరిస్తున్నారు. "ఈ విధంగా జంగం కథ ప్రాంతీయమైన భేదాలతో, వివిధ నామాలతో పిలువబడుతూ ఉంది". ఈ కథకు ఇన్ని పేర్లు రావడానికి కారణం కూడా లేకపోలేదు.

ఈ కథలో ప్రధాన కథకుడు తంబురాను ఉపయోగిస్తున్నాడు. ఆ తంబురాను ఉపయోగించే బుర్రను బట్టి దీనికి తంబురా కథ అని, బుర్రకథని పేరు వచ్చి ఉండవచ్చు. ఈ కథలో ఉపయోగించే గుమ్మెట్లను డక్కిలని, బుర్రలని వ్యవహరించడం వల్ల ఈ కథలకు డక్కీ కథలని, బుర్రకథలని పేరు సార్థకమై ఉండవచ్చునని కొందరి అభిప్రాయం.

**బుర్రకథలు పుట్టుక:** బుర్రకథల లక్షణాల స్వరూప స్వభావాలను తెలుసుకునే ముందు బుర్రకథలు పుట్టుకను గూర్చి తెలుసుకోవడం అవసరం. "ఆచార్య నాయని కృష్ణకుమారి గారు ప్రాచీనమైన జానపద గేయ గాథల్లో ముఖ్యంగా జంగం కదలే బుర్రకథలకు మూలమని నిరూపించారు". సంగీతము, నృత్యము, అభినయము, రూపకం అనే జానపద ప్రదర్శన కళారూపాల సమ్మేళనం బుర్రకథ. ఇది సంగీతంతో వాద్యాల సాయంతో, వంతల తోడ్పాటుతో, పాధాన్యాస హస్తచలనంతో రసస్ఫూర్తివంతంగా గాథా ప్రవర్తకులు నిర్వహిస్తారు. సాహిత్యంతో పాటు గాథా ప్రవర్తకుని అంగ విన్యాసాది ముఖ కవళికలు మొదలైన వాటి అభినయం మూలానే ప్రేక్షకులు ఆనందిస్తారు. కాబట్టి వీటిలో సామాన్య జనజీవన రీతి, నాటకీయత, గానమనే జనాకర్షణ గుణాలు గలవు.

1947 తరువాత జానపద, సాహితీ శాఖగా బుర్రకథ తెలుగు సాహిత్యంలో ఒక స్థానాన్ని పొందగలిగింది. దేశ వీరుల్ని గురించి, ప్రముఖ సంఘటనని గురించి, పుంఖాను పుంఖాలుగా బుర్రకథలు నాగరికతల చేత రచింపబడ్డాయి. జానపద కళా విభాగమైన బుర్రకథలని ప్రచార సాధనంగా ప్రభుత్వం వారు కూడా వినియోగించుకుంటున్నారు.

ఈ కథలకు జంగం కదలన్న పేరు కోస్తా జిల్లాలలో ప్రచారంలోకి వచ్చింది. జంగం శబ్దం కుల సంబంధిగాక, బసవేశ్వర స్థాపితమై వీరశైవ మతావబలంబులు జంగాలని పిలవబడేవారు. వీరశైవ మత ప్రచారానికై వీర శివ భక్తుల గాధలను పాడి వినిపించేవారు. ఇవి జంగాలు చెప్పే కథలు కనుక జంగం కథలు. "ఈ జంగాల గూర్చి ఆచార్య బిరుదురాజు రామరాజు గారు వివరంగా తెలిపారు" " ఈ జంగం కథలను పాల్కురికి సోమనాథుడు పేర్కొన్నాడు". "పిచ్చుకుంట్లు, ఎర్ర గొల్లలు, వీరముష్టులు, శారద కాండ్రు మొదలైన వారందరూ శైవులు. జంగం అంటే శివ సంబంధి, శివ భక్త సంబంధి కథలను చెప్పేవారిని ఆచార్య నాయని కృష్ణ కుమారి గారు వివరించారు". "ఈ జంగాలను వారు ఉపయోగించే బుడిగను బట్టి

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

బుడిగ జంగాలని అంటారు. ఇంకా పిడికి జంగాలు, ఈతముక్కల జంగాలు, శెట్టిబలిజలు మొదలగు తెగలకు చెందిన వారిని తెలుస్తుంది". ఈ జంగాలు చెప్పే కథలే జంగం కథలు. ఇవి ఈనాటి బుర్రకథలకు పూర్వ రూపాలు.

**ప్రధాన కథకుడు** ఒక చేతితో శృతి కోసం తంబుర మీటుతూ, జేబురు మాల వంటి గుడ్డ కొసను కట్టిన జంతరను బొటనవేలికి తొడుక్కున్న మరొక చేత్తో తాళం వేస్తూ కథ చెబుతాడు. ఆ వెనుక ఇద్దరు స్త్రీలు గుమ్మటలు వాయిస్తూ వంత పాడుతారు. "వంతకు ఇద్దరు ఇంతులు కావాలని సిరిజంగాలు రెండు పెండిండ్లు చేసుకోవడం కూడా ఆచారం. ఇది దీని ప్రత్యేకత".

"యక్షగానాలు యక్షులు వినిపిస్తే, బుర్రకథలను జంగాలు పాడి వినిపిస్తారు. యక్షగానాలలో సూత్రధారి, విదూషకులు ఉండగా, బుర్రకథలో వంతలు ఉన్నారు. హాస్యం రెండింట సమానమేనని మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి గారు వివరించారు".

తంబురకథ అను పేరు జానపద గాథా కారులలో నేటికీని విరివిగా వ్యాప్తియందు ఉన్నవి. "అసలు తంబురా శబ్దములోనే బుర్ర శబ్దం ఇమిడి ఉన్నది. తంత్రి + బుర్ర = తంబుర. కాబట్టి తంబుర కథ యను పేరు నుండియే బుర్రకథ యను పేరు వచ్చి యుండుననుట సమంజసం".

ఇలాంటి బుర్రకథలకు మూలమైన కథాగేయాల పుట్టుక ఎప్పటిదని చెప్పడానికి తగిన ఆధారాలు లేవు. హాలుడు సేకరించిన ప్రాకృత గాథల్లో ఈ పాటల ప్రసక్తి ఉంది. కానీ ఆనాటి తెలుగు గేయ గాథల్ని ఎవరు సేకరించలేదు. ప్రారంభంలోని శాసనాల్లో గాని, భారతంలో గాని వీటిని గూర్చి లేదు. "నన్నెచోడుని కుమార సంభవంలో గౌడు గీతాల ప్రసక్తి ఉంది"". "పాల్కురికి సోమనాథుడు తోలుబొమ్మలు, కొయ్యబొమ్మలాడించే వారిని", "భజన కోటాల్లో భక్తుల చరిత్రను కథలుగా పాడే వారిని". "కోలాటం, గొండ్లి, పేరిణి, కేలిక లాంటి జానపద నృత్యాలను వేణు వాద్యాలతో పాడే ఆనంద గీతాలు, శంకర గీతాలను పాడేవారిని" పేర్కొన్నాడు.

బుర్రకథ ముగ్గురు ప్రదర్శకులతో నిర్వహించబడుతుంది. వీరిని కథకుడు, రాజకీయం, హాస్యం అని పిలుస్తారు. మధ్యలో ఉండే కథకుడు పాడేదానికి చెప్పేదానికి ఇటు అటు ఉన్న ఇద్దరు తందాన తానా అని వంత పాడుతారు.

ప్రధాన కథకుడు ముఖ్య కథను, వర్ణనలనూ, నీతిని, వ్యాఖ్యలను వచనంగా చెబుతూ, సందర్భం వచ్చిన చోట భావపరమైన స్ఫూర్తిని కలిగించేందుకు రసవంతమైన పాటలు పాడుతాడు. కథకుడు ముఖ్య కళాకారుడు. ఇతనే ముఖ్య కథకుడు. ఒకవేళ ఎప్పుడైనా వేరే కబుర్లతో మిగిలిన ఇద్దరూ పక్కదారి పడుతుంటే ముఖ్య కథలోకి తీసుకొస్తూ నిబద్ధతతో కథ చెప్పడం ఇతని బాధ్యత. ఈ పాత్ర పోషించే వ్యక్తికి మాట ఆట పాట బాగా తెలిసి ఉండాలి.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

బుర్రకథలో రెండో వ్యక్తి ముఖ్య కథకుడి కుడి భుజం వైపు ఉంటాడు. ఇతన్ని రాజకీయం అంటారు. అంటే ముఖ్య కథకుడు ఎక్కువగా పాటలతో కథలు చెబుతుంటే మధ్యలో వచనం వచ్చినప్పుడల్లా ముఖ్యమైన చర్చల్ని ఇతను కథకుడితో చేస్తుంటాడు. లేదా ఆహ్, ఓహో అంటూ వంత పాడుతుంటాడు. రంగుల దుస్తులతో, విభూతి రేఖలతో, చేత డప్పులతో ఇతను కథకునికి పాటలోను, చిందులోనూ తోడుంటాడు. కథలో పట్టు నిలబెడుతుంటాడు. ఉత్సాహాన్ని ఊపును పంచుతుంటాడు. ప్రేక్షకుల ఆసక్తిని పెంచుతుంటాడు. మూడో వ్యక్తి హాస్యం చేసినప్పుడు అతనితో ఇతను చర్చిస్తాడు. ఆ సమయంలో కథకుడు వెనక్కి వెళ్తాడు.

రాజకీయం, హాస్యం ఇద్దరూ సరదా సంగతులు చర్చించుకున్నాక మళ్ళీ మధ్యలోని కథకుడు ముందుకొచ్చి ముఖ్య కథను కొనసాగిస్తాడు. ముఖ్య కథకుడికి అండగా ఉండి సహకరించడమే ఇతని ముఖ్య బాధ్యత. బుర్రకథలో మూడో వ్యక్తి హాస్యం. ప్రస్తుత నిత్య జీవితానికి సరిపడే విధంగా కబుర్లు చెబుతూ, ముఖ్య కథకి అప్పుడప్పుడు అడ్డుకట్ట వేస్తున్నట్టు అనిపిస్తుంది గానీ అది కేవలం వినోదం కోసమే. హాస్యగాడు తన హాస్యంతో ముఖ్య కథ తాలూకు విలువని తగ్గించకుండా, గాంభీర్యాన్ని కోల్పోకుండా చూస్తాడు. తిరిగి కథలోకి జనాన్ని తీసుకువెళతాడు.

బుర్రకథలలో కథా వస్తువు కొరకు అనేక వనరులు ఉన్నాయి. దేవతా కథలు, పౌరాణికాలు, జానపదాలు, రాజకీయాలు, చరిత్రకారులు, ఉద్యమకారులు, వివిధ రంగాలలో ప్రముఖులు, పల్లె పట్టణ సమస్యలు ఇలా అనేక రకములు గలవు.

బుర్రకథలను ప్రజా ప్రబోధానికి ఆయుధంగా ఉపయోగించారంటే అందులో ఒక విశేషం లేకపోలేదు. బుర్రకథ ఫణితులు చాలా ఉత్తేజ కరమైనవీ, ఉద్రేకమైనవి. అన్ని రసాలను తేలికగా ప్రజా హృదయాల్లో చూపించగల శక్తి ఈ బుర్రకథలకు ఉంది. వీర రసం ద్వారా ప్రజలను ఉద్రేక పరచవచ్చును. కరుణ రసం ద్వారా ఏడిపించవచ్చును. హాస్యరసం ద్వారా కడుపుబ్బ నవ్వించవచ్చు. శృంగార భీభత్సరసాలకు ప్రాముఖ్యం తక్కువైనా నవరసాలు ఈ బుర్రకథల్లో మిళితమై ఉన్నాయి. సంగీతం, సాహిత్యం, నృత్యం, వాద్యం, శిల్పం, తాళం, లయ, అభినయం ఆహార్యం మొదలైన హంగులన్నీ ఈ బుర్రకథల్లో తొణికిసాడుతోంది. ఈ కథల్లో ఉపయోగించే గుమ్మటలు వీరణపు మ్రోతలను గుర్తుకు తెస్తాయి. బుర్రకథ కళారూపంలో ప్రజలను మేల్కొల్పే మహత్తర శక్తి ఉంది. ఈనాటికి ఈ కళారూపం విద్యాధికుల నుండి అతి సామాన్యుల వరకూ ఆనందంపజేయగల ఉత్తమ జానపద సంగీత కళారూపంగా తయారయింది.

బుర్రకథల్లో కథకుడు తంబురాను ధరించి శృతిని మీటుకుంటూ చేతి అందెలతో తాళం వేస్తూ కాళ్ళతో నృత్యం చేస్తూ కథను ప్రారంభిస్తాడు. ప్రక్కనున్న వంతదారులు రెండు గుమ్మటలను భుజాలకు

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

తగిలించుకొని "దద్దో తిమి, తధిమి తత్తదిమి, తకిట తతదిమి, దీంతక్క దాతద్దిందా, ద్దిందా, తక తక్కి, తక తక్కా" అనే దరువు వేస్తూ 'తదిగినతోం ' అంటూ మధ్య మధ్య గమకాలనిస్తూ కథా సన్నివేశాలను ననుసరించి మధ్య మధ్య అరరే, భళి భళి అంటూ కథకుడికి హుషారునిస్తూ, ఉధృతంగా నృత్యం చేస్తూ ప్రజలకు అందుబాటులో అన్ని ప్రక్కలకూ తిరుగుతూ ఉంటారు. కథకుని లయ ప్రకారం వంతలు గమకంగా వాయిస్తారు. కథకుడు చక్కగా చరణం పాడితే దానిని వంతదార్లు తిరిగి వంత పాడుతారు. కథకుడు కథను వివరిస్తే మరో వంతదారు(హాస్యగాడు) ప్రేక్షకులకు వచ్చే అనుమానాలను హాస్య ధోరణిలో కథకుని ప్రశ్నించి, సున్నిత హాస్యంతో ప్రజలను ముగ్ధుల్ని చేసి కథను ముందుకు నడిపేవారు. ఈ హాస్యం వల్ల పరాకుగా ఉన్న ప్రేక్షకులు అందర్నీ ఒక హద్దులో ఉంచి కథను వినేటట్లు అభిలాషను కలిగించేవారు. కథకునికి వంతలకు మధ్యనున్న అవినాభావ సంబంధం ఇంతా అంతా అని చెప్పలేం. కథా గమనంలో ఆయా ఘట్టాలలో ఎక్కడా వీసమంత వెలితి రానీయరు. కావాలనుకున్నప్పుడు ప్రేక్షకులను నవ్వించగలరు, ఏడిపించగలరు, ఉద్రేక పరచగలరు. కథను విన్న ఆ కొంచెం సేపూ ప్రేక్షకులను వడలు మరిచేటట్లు చేయగలరు. వంతలు కథను ఆలపిస్తుంటే కథకుడు చేతిలో ఉన్న అందెలతో బాటు ఒక అందమైన చేతి గుడ్డను ఊపుకుంటూ రెండవ చేతితో తంబురాను మీటుతూ, కాళ్ళ గజ్జలు ఘల్లుమనేటట్లు నృత్యం చేస్తూ అటూ ఇటూ చేతులు ఊపుకుంటూ సాత్విక, ఆంగిక చలనాదులతో రంగస్థలం అంతా కలియ తిరుగుతూ యుద్ధఘట్టాలలోనూ, రౌద్ర ఘట్టాలలోనూ పిడుగులు పడ్డట్లు ఎగిరి ఎగిరి గంతులు వేస్తూ, గిర్రు గిర్రున గిరికీలు కొడుతూ, పళ్ళు పటపట కొరుకుతూ 'అరరే, అరెరె ' అంటూ వంతలను కేకలతో అదలిస్తూ హంగామా చేసి ప్రేక్షకులను నివ్వెర పోయేటట్లు చేసే వారు. పైన వివరించిన ప్రదర్శన విధానాన్ని బట్టి, బుర్రకథ కళారూపం ఎంత పదునైనదో మనకు బోధపడుతుంది. ముగ్గురు వ్యక్తులతో కూడిన ఈ కళారూపం యొక్క ప్రాముఖ్యం అనిర్వచనీయమైనది. ఇది ఇంతటి ఉత్తమ కళాయుధం కనుకనే చారిత్రాత్మకంగా ఆంధ్ర ప్రజా హృదయాలలో హత్తుకుపోయింది.

బుర్రకథ ప్రదర్శనలకు రంగస్థలం అంటూ ఏమీ లేదు. విశాలమైన ఒక వీధిలో పందిరి వేసి చుట్టూ కిరసనాలు లాంతర్లు వ్రేలాడ కట్టేవారు. ఈ లాంతర్లు లేని రోజుల్లో ఆముదపు దీపాలను, నూనె కాగడాలను వెలిగించేవారు. కొన్నాళ్లు పెట్రోమాక్స్ లైట్లు వాడేవారు. కాలక్రమంలో విద్యుత్ దీపాలు అలంకరణలో అతి తేలికగా బుర్రకథ కార్యక్రమం జరిగిపోతుంది. కథకునికి ఒక తంబురా, మూడు అందెలు, రెండు కాళ్లకు గజ్జలు, వంతకు రెండు గుమ్మట్లు, ముగ్గురికీ మూడు గౌన్లూ, మూడు తల గుడ్డలు ఉంటే సరి కథ జరిగిపోతుంది. ఒక్కసారి ఈ సామాగ్రిని ఏర్పాటు చేసుకోగలిగితే రోజువారీగా కావలసిన సామాగ్రి ఏమీ ఉండదు. ముగ్గురు వ్యక్తులు వేలాది ప్రజలకు తెల్లవార్లూ కథ వినిపించి కూర్చోబెట్టగలరు. వీరి బృందం ఒక గ్రామం నుంచి మరో గ్రామం వెళ్లాలంటే ఎవరి సామాను వారు భుజాలకు తగిలించుకొని సునాయాసంగా

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

ప్రయాణం చేస్తారు. గ్రామ ఉత్సవాలలోనూ, ఇంటి పండగలలోనూ ఈ బుర్రకథలను ఎక్కువగా ప్రదర్శింప చేస్తారు.

బుర్రకథ వచ్చిన తొలినాళ్లలో ఆంధ్రదేశపు పల్లెల్లో రైతు కూలీలకు పనిలేని తీరిక సమయాలలోనూ, దేవుని ఉత్సవాలలోనూ ఈ కథలను చెప్పేస్తూ ఉండేవారు. ఈ కథలను చెప్పే కళాకారులు పగటిపూట శంఖు, గంటలతో ఇంటింటా ప్రచారం చేస్తూ, ఈ రాత్రికి నడి బజారులో ఫలానా కథ బుర్రకథగా చెబుతున్నామని, ఫలానా వారు చెప్పేస్తున్నారని ఇంటింటా ప్రచారం చేస్తూ, లాంతర్లను ప్రోగు చేసి తెల్లవారే వరకు ఈ కథలను చెప్పి వేలాది ప్రజలను ఆనందింప చేసేవారు. ఆనాడు బుర్రకథలకు మంచి ఆదరణ ఉండేది. ఒకనాడు ప్రబోధం కోసం ఏర్పాటు అయిన బుర్రకథ కళారూపం వంశపారంపర్యంగా జీవనోపాధికి అంకితమైనది.

ఆంధ్ర ప్రజా జీవితంలో ఇంత విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్న ఈ బుర్రకథను గూర్చి పాల్కురికి సోమనాథుడు బసవపురాణంలో గాని, పండితారాధ్య చరిత్రలో గాని, తొలి వీధి నాటకం క్రీడాభిరామంలో కానీ ఎవ్వరూ దీనిని పేరు పెట్టి స్పష్టంగా పేర్కొనక పోవడం చూడగా ద్విపద భూయిష్టమైన ఈ రచనకు ప్రక్కవాద్యాల ప్రాబల్యాన్ని బట్టి క్రమేపి ఈ బుర్రకథ పేరు రూఢమై ఉండవచ్చు. ప్రాచీన కళారూపాలైన యక్షగాన, వీధి నాటకాల పూర్వరూపం బుర్రకథ కావచ్చునని, శ్రీనాథుని కాలానికి ముందు నుంచే ద్విపద ప్రబంధం, బుర్రకథ వంటిది గాన రూపంలో ఉందనడానికి క్రీడాభిరామంలోని ఈ క్రింది పద్యమే తార్కాణమని తిరుమల రామచంద్ర గారు 'జయంతి' పత్రికలో ' తెలుగువారి తొలి సంగీత కళారూప' మనే వ్యాసంలో ఉదాహరించారు.

"ద్రుత తాళంబున వీర గుంభితక ధుం ధుమ్ ధుంకి టాత్కారసం గతి వాయుంపుచు నాంతారాళిక యతి గ్రామాభిరామంగా యతి గూడం ద్విపద ప్రబంధమున వీరాణీకముంబాడే నొ క్కతే ప్రత్యక్షరముల గుమారకులు ఫీట్కారంబునన్ దూలగాన్"అని 14వ శతాబ్దంలో రచింపబడిన క్రీడాభిరామ కాలానికే బుర్రకథ కళారూపం ప్రచారంలో ఉందనడానికి ఈ పద్యంలో ఉదాహరించిన ఇతివృత్తమే నిదర్శనం. దీని ఇతివృత్తం వీర చరిత్రకు సంబంధించినది.

శ్రీనాథుడు కాశీఖండంలో దక్షవాటి పురమును వర్ణిస్తూ..... కీర్తింతు రెద్దాని కీర్తి గంధర్వులు గాంధర్వమున యక్షగానసరని" అనడాన్ని బట్టి గంధర్వగానాన్ని యక్షగానసరనిలో పాడి వినిపించే వారిని అర్థమవుతుంది. పై ఉదాహరణలను బట్టి బుర్రకథ వివిధ వాద్య విశేషాలతో వివిధ పాత్రలను అభినయించేదని తెలుస్తుంది.

గుమ్మెట్లవాద్యం గంభీరంగాను, గుంభనంగాను ఉండే ధ్వని విశేషం అవడం వల్ల దీనికి 'గుంభిత ' అనే పేరు వచ్చి ఉండవచ్చు. ఈ గుంభితను ఆనాడు స్త్రీలు వాయించినట్లే ఈనాటి కథల్లో స్త్రీలు,

పురుషులు కూడా వాయిస్తున్నారు. ఈ డక్కీలు పూర్వం నుంచి ఉన్న వనడానికి కాశీఖండంలో శ్రీనాధుడు.....

"వల్లకి చక్కి కాహలము వంశము డక్క హుడుక్క ఘర్ఘరుల్ ఘల్లని యాదిగా గలుగు శబ్ద పరంపర తాళ శబ్దమై" అని ఉదాహరించడాన్ని బట్టి డక్క హుడుక్క అనే దానినిబట్టి కాహలం మొదలైన వివిధ వాద్యాలతో పాటు డక్క అనే నేటి డక్కీని బుడబుక్కల వారు ఉపయోగించే హుడక్కను కూడా ఉపయోగించి ఉండవచ్చు.

పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రలో.. "అలరుచు బడిహారులట్ల యందరును లలినొచ్చి చాంగు భళాయను వారు" అనే దానినిబట్టి నేటివంతలు పాడే "భళానోయి భాయి తమ్ముడూ, మేల్ భళానోయి దాదా" అనేదానికి దగ్గరగా ఉండడాన్ని బట్ట "తందానా తాని తందానా, భళా, భళి" మొదలైన వంత విశేషాలు ఆనాటి నుంచి బుర్రకథల్లో ప్రచారంలో ఉన్నట్లు మనం తెలుసుకోవచ్చు. బుర్రకథ గాన విశేషంగా రూపొందింది అనడానికి పై ఉదాహరణలు చాలు.

యక్షగానాలు రచనలో, ప్రదర్శనలో అభివృద్ధి చెందుతున్న మూల యక్షగానమైన సంగీత రూపం బుర్రకథగా రూపొందింది. హరికథ పితామహుడైన అజ్జాడ ఆదిభట్ల నారాయణ దాసు గారు తను రాసిన బుర్రకథలన్నీటిని యక్షగానాలనే వ్యవహరించారు. యక్షగానంలో సూత్రధారుడూ, విదూషకుడూ వున్నట్లే బుర్రకథలో వంతదారులు ప్రవేశించారు. యక్షగానంలో విదూషకుడు హాస్యం చెబితే, బుర్రకథలో వంతదారు హాస్యం చెబుతాడు. ఆనాటి నుండి ఈనాటి వరకు కొన్ని బుర్రకథలను స్త్రీలు కూడా చెప్పడం వల్ల ప్రేక్షకులను ఎక్కువగా ఆకర్షించగలిగేవారు.

ఈ విధంగా పరిశీలన చేసేటట్లయితే "మూల యక్షగానం రూపాంతరం పొంది బుర్రకథగా పరిణామం చెందిందని" శ్రీనివాస చక్రవర్తి గారు నాజరు సన్మాన సంచికలో ఉదాహరించారు.

జానపద వాంగ్మయంలో బుర్రకథల సాహిత్యం ఒక ప్రత్యేక స్థానాన్ని వహిస్తూ ఉంది. ఈ సాహిత్యంలో చాలా రకాలు కనిపిస్తున్నాయి. చాలావరకు పూర్వపు యక్షగానాల్లో ఇతివృత్తమంతా పురాణ గాథలకు సంబంధించింది. యక్షగానాలు బుర్రకథలుగా అభివృద్ధి చెందిన తరువాత బొబ్బిలి యుద్ధం, పల్నాటి వీర చరిత్ర మొదలైన చారిత్రక యుద్ధ కథలు, బాలనాగమ్మ, కామమ్మ, చిన్నమ్మ, లక్ష లక్ష్మమ్మ, తిరుపతమ్మ, జానకి వాసము మొదలైన కరుణ రస ప్రధానమైన పాతివ్రత్య గాథలు, ఉత్తర గోగ్రహణం, వామన విజయము, దేవయాని చరిత్ర, అంబరీషోపాఖ్యానం మొదలైన భారత రామాయణ గాథలకు సంబంధించిన అనేక కథలు వచ్చాయి.

ఆనాటి నుండి ఈనాటి వరకు బుర్రకథలు ప్రచారంలో ఉన్నాయి. ఈనాడు బుర్రకథల పద్ధతిని రాజకీయ, సాంఘిక పరిస్థితులకు అన్వయించి ప్రచారం చేస్తున్నారు. వెనుకటి వీరరసగాథల్ని దేశభక్తిని

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

పురికొల్పే దేశ నాయకుల జీవితాలైన "గాంధీ జీవితం, అల్లూరి సీతారామరాజు, సుభాష్ చంద్రబోస్" మొదలైన దేశభక్తుల జీవిత గాథలూ, కష్టజీవి, రైతు విజయం మొదలైన కష్టజీవుల గాథలు చెప్పి ప్రజాప్రభోధం చేస్తున్నారు.

ఆనాటి పరిస్థితుల్లో కృష్ణాజిల్లా దివితాలూకాలో కీర్తిశేషులు పెండ్యాల వెంకటేశ్వరరావు, పరుచూరి రామకోటయ్య గార్లు దేశభక్తిని పురికొల్పుతూ, యువజన మహాసభలలో వైజ్ఞానిక కార్యక్రమముగా బుర్రకథ కార్యక్రమాలను చెప్పడం ప్రారంభించారు. వీరి కార్యక్రమాన్ని చూచి ఉత్తేజితులైన కోసూరు పున్నయ్య, సిరివి శెట్టి సుబ్బారావు, గోవర్ధన మొదలైన దివితాలూకా కొత్తపాలెం కు చెందిన వారు దేశభక్తిని పురికొల్పుతూ బుర్రకథలు ప్రారంభించారు. అదే సమయంలో అటు గుంటూరు జిల్లాలో కాకుమాను సుబ్బారావు, దావులూరు, చింతల సూర్యనారాయణ మొదలైన వారు రష్యన్ వీరనారి 'తాన్య ' 'ఝాన్సీ లక్ష్మీబాయి' మొదలైన వీర వనితల కథలను చెప్పి ప్రజలను ఉత్తేజపరుస్తూ ఉండేవారు.

గుంటూరు జిల్లాలో నాజరు, రామకోటి, పురుషోత్తం మొదలైన వారితో ఏర్పడిన బుర్రకథ దళం ఉత్తేజంగా బుర్రకథలు చెబుతూ ఉండేది. మోటూరు ఉదయం, చింతల కోటేశ్వరమ్మ, మహంకాళి లక్ష్మి మొదలైన వారు మహిళా బుర్రకథ దళంగా ఏర్పడి రష్యన్ వీరనారి "టాన్య" కథను బుర్రకథగా హృదయాలు ద్రవించేటట్లు చెప్పేవారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో చుండ్రు సూర్యనారాయణ, చుండ్రు చిన్నబ్బాయి,

మాణిక్యాలరావు మొదలైన వారు జిల్లాలో విరివిగా బుర్రకథల ద్వారా ప్రచారం చేయడమే కాక మరికొన్ని బుర్రకథ దళాలను క్యాంపులు పెట్టి తయారు చేశారు.

ఆ రోజుల్లోనే గుంటూరు జిల్లాలో ఉప్పుగుండూరు బాలుర బుర్రకథ దళం ఆంధ్ర దేశాన్నంతా ఆకర్షించింది. కర్నూలు జిల్లా గిద్దలూరు ప్రాంతంలో తుపాకుల బసవయ్య దళం పనిచేస్తూ ఉండేది. నెల్లూరు జిల్లాలో రాజగోపాల్ బుర్రకథ దళం, కడప జిల్లా జమ్మలమడుగులో హుస్సేన్ బాబా బుర్రకథ దళం విరివిగా కథలు చెబుతూ ఉండేవి.

మన్యం విప్లవకారుడైన అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రను సుంకర సత్యనారాయణ బుర్రకథగా వ్రాయగా, ఆ కథను ఎంతో రసరవత్తరంగా ప్రదర్శించి ఆంధ్ర ప్రజానీకాన్ని ఉర్రూతలూగించారు. ఆంధ్రదేశంలో అనేక ప్రాంతాల్లో ఈ కథను చెప్పడమే గాక ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో మంత్రుల సమక్షంలో ఈ కథను ప్రదర్శించి ఆనాటి కాంగ్రెస్ మంత్రుల మన్ననలు పొందడమే కాక వారి నుండి పారితోషికాలు కూడా పొందారు. కానీ అనతి కాలంలో ఈ బుర్రకథను కాంగ్రెస్ ప్రభుత్వం నిషేధించింది.

వీరేశలింగం గారి జీవిత చరిత్ర బుర్రకథ ద్వారా నాటి సంఘంలో ఉన్న కుళ్ళును, సంఘవిద్రోహులను, మఠాధిపతులను, లంచగొండులను చీల్చి చెండాడుతూ సాంఘిక సంస్కరణలకు,

సాహిత్య ఉద్యమాలకు దోహదమిచ్చారు. పలనాటి యుద్ధం ద్వారా • పూర్వవీరుల పౌరుషాన్ని జ్ఞప్తికి తెచ్చి ప్రజలను ఉత్తేజపరిచారు. బెంగాల్ కరువు బుర్రకథ ద్వారా ఆనాడు రాయలసీమలోనూ, బెంగాల్లోనూ, మలబార్ లోనూ, విశాఖపట్నంలోనూ కరువు రాక్షసి లక్షలాది ప్రజల ఆకలి మంటల్లో ఎలా మగ్గిపోయారో కళ్ళకు కట్టినట్లు చూపి వారికి సహాయ పడటానికి వీధులు వెంట తిరిగి విరాళాలు వసూలు చేసి సోదర ప్రజల ప్రాణాలను కాపాడారు.

సుంకర సత్యనారాయణ రచించిన కష్టజీవి బుర్రకథ ద్వారా బ్రిటిష్ వారు బానిసత్వంలో ఉన్న మనదేశంలో జమీందారీ యుగాన్ని ఎలా సృష్టించింది, ఆజమీందారులు, భూస్వాములు పేద ప్రజల్ని ఎలా దోచుకున్నదీ, కష్టజీవుల రక్తాన్ని ఎలా పీల్చి పిప్పి చేసిందీ, చివరికి జమీందారీ రైతు పోరాటంలో కష్టజీవులు ఎలా విజయం పొందినదీ, కళ్ళకు కట్టినట్లు హృదయాలు ద్రవించేటట్లు చెప్పేవారు.

వీర వనిత ఝాన్సీ లక్ష్మీబాయి కథ ద్వారా • 1857లో సిపాయి తిరుగుబాటులో చంటి బిడ్డను మూపున కట్టుకొని బ్రిటీష్ వారిని గడగడలాడించిన ఝాన్సీ లక్ష్మీబాయి స్వాతంత్రోద్యమం కోసం ఎలా బలైపోయిందో వివరిస్తూ ఆ వీరనారి సాహసాన్ని, దేశభక్తిని, త్యాగాన్ని స్మరిస్తూ ప్రజలందరినీ ఉద్రేక పరుస్తూ స్వాతంత్ర సమరంలో దూకేతట్లు ఉత్తేజపరిచేవారు.

ప్రజలను ఉర్రూతలూగించే కళారూపమైన బుర్రకథను క్రైస్తవులు కూడా వారి మత ప్రచారం కోసం వినియోగించారు. బుర్రకథ లక్షణాల గురించి గేరా ప్రేమయ్య అనే బుర్రకథ రచయిత తన పండిత రమాబాయి, దావీదు విజయము, ఏసేబు చరిత్ర, సెహెమ్యా చరిత్ర అనే బుర్రకథలు ఉదహరించారు. క్రైస్తవ కథలు ప్రాచీనమైనవి. వీటిని ఈనాడు కొందరు బుర్రకథలుగా మలిచారు. అందరూ ఈనాటి సమాజంలోని కుళ్ళుని చెప్పడానికి ప్రయత్నించారు. "గేరా ప్రేమయ్య గారి యోహాను శిరచ్ఛేదము బుర్రకథలు బ్లాక్ మార్కెట్ బంధించబడాలని చెప్పే ప్రబోధం ముఖ్యమైనది. "

బుర్రకథలు చెప్పే ప్రాచీనులలో దొడ్డారపు వెంకటస్వామి, అంజే కోట దాసు, జంగా సుబ్బదాసు, యాదవదాసు, రెంట పాళ్ళ గుడ్డి జంగం, గం కోల కోలపెన్ను, సమ్మెట రామలింగం, జంగయ్య, సుబ్బయ్య, దేవర దావులూరు, ఎల్లమంద మొదలైన ఎందరో మహామహులు బుర్రకథకులుగా వర్ధిల్లి కాలగర్భంలో కలిసిపోయారు.

ఆధునిక బుర్ర కథకులలో పద్మశ్రీ షేక్ నాజర్, సుంకర సత్యనారాయణ, కోగంటి కాకుమాను సుబ్బారావు, పట్టం శెట్టి ఉమామహేశ్వరరావు, శరివిశెట్టి సుబ్బారావు, డాక్టర్. మిక్కిలినేని, పెరుమాళ్ళు, మాచినేని, వడ్లపూడి నాగేశ్వరరావు, ఉప్పుగుండూరు కృష్ణమూర్తి, భీమవరం బాలికలు, చుండ్రు చిన్నబ్బాయి, కడప హుస్సేన్ బాబా, గిద్దలూరు తుపాకుల బసవయ్య, నిట్టల బ్రదర్స్, సలాది భాస్కరరావు, జూనియర్ నాజర్ బెనర్జీ, ప్రసాద్ మోటూరి ఉదయం, తుమ్మల కేశవరావు, గుడివాడ

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

రాఘవులు, కాజా బుర్రకథ దళం, నందిగం బ్రదర్స్, సబ్బి కనకారావు, కొండేపూడి రాధ, రాఘవరెడ్డి దళం మొదలైన వారంతా బుర్రకథలను చెప్పారు.

డా. కుమ్మరి మాస్టారు, భద్రకాళి పున్నమరాజు, హనుమంత రాజు, వింజమూరు రామారావు, గొర్రెల రామలింగం, సైదులు, నదీరా, జయంతి, త్యాగరాజు, బూర్గుల రామమూర్తి, వందన కోటేశ్వరరావు, శిష్ట సాంబశివరావు, రెడ్డి చిన్న వెంకటరెడ్డి, కృష్ణమోహన్, తాత నాగేశ్వరరావు, జిల్లెలమూడి ప్రసాద దళం, పురుషోత్తం, కనకయ్య, చిట్టాల నారాయణరావు, నీలా జంగయ్య, రొంగ సత్యనారాయణ, రాజోలు లక్ష్మణరావు, భువనగిరి నారాయణ, కొమర శ్రీధళం, బళ్ళా ఈశ్వరుడు, శ్రీమతి శారద, కుమారి వాణి, పూసల రజనీగంగాధర్, రామసుబ్బరాయుడు, తిరుపతి వెంకటసుబ్బయ్య, చేజర్ల శివరామయ్య, మంగం సత్యనారాయణ, గరివిడి లక్ష్మి, కొర్లకోట ధనుంజయరావు మొదలైన వారందరూ బుర్రకథకులుగా వర్ధిల్లారు.

బుర్రకథ రచయితలుగా ప్రజాకవి సుంకర సత్యనారాయణ, కాకుమాను సుబ్బారావు, షేక్ నాజర్, వానమామలై వరదాచార్యులు, మాచిరాజు లక్ష్మీపతి, కోగంటి గోపాలకృష్ణయ్య, కవి కుమార్, జంపన చంద్రశేఖర రావు, కొసరాజు రాఘవయ్య చౌదరి, లక్ష్మీకాంత మోహన్, తెల్లాకుల వెంకటేశ్వరగుప్త, రుక్కాభట్ల విధుమౌళి శర్మ, పేరి సుబ్బారావు, తిరునగరి టి. రామాంజనేయులు, నీలా జంగయ్య, శ్రీపాద రామమూర్తి, వారణాసి వెంకటనారాయణ శాస్త్రి, రామ కవచం సత్యనారాయణ, పి. బాలకృష్ణ, ప్రయాగ నరసింహ శాస్త్రి, చిన వెంకటరెడ్డి, యనమండ్ర సుబ్బారావు, దంటు కృష్ణమూర్తి, నదీరా మొదలైన వారెందరో సాంఘిక, రాజకీయాలకు సంబంధించిన బుర్రకథలు ఎన్నింటినో రచించి పేరు పొందారు.

**ముగింపు:**. ప్రజల ఆచార వ్యవహారాలకు, ఉత్సాహ ఉద్రేకాలకు, సుఖదుఃఖాలకు జానపదం అద్దం పడుతుంది. అలాంటి కళారూపాల్లో బుర్రకథ ఒకటి. కొన్ని దశాబ్దాలుగా పల్లె జనాన్ని అలరిస్తూ ఇప్పటికీ తన అస్తిత్వాన్ని నిలబెట్టుకుంటున్నది. రాచరికం మొదలు ప్రజాస్వామ్యం వరకు సమాజంలో వచ్చిన ప్రతి మార్పులో తనదైన పాత్ర పోషించింది. ప్రజలను చైతన్యపరిచింది. స్వాతంత్ర్యోద్యమ నుంచి తెలంగాణ విమోచన దాకా ప్రతి ఉద్యమంలోనూ సామాన్యులను ముందుండి నడిపించినది.

తెలుగునాట జానపద వినోద గాన ప్రక్రియలలో ప్రబోధానికి, ప్రచారానికీ సాధనంగా ఈనాటికి విస్తృతంగా ఉపయోగపడే కళారూపం బుర్రకథ. కథకుని చేతి ప్రక్రియ ఇది. ప్రదర్శన సౌలభ్యాన్ని బట్టి వీర గాథలు, త్యాగమూర్తుల కథలు బుర్రకథల ఇతివృత్తాలుగా బాగా పేరొందాయి. ఈ ప్రక్రియ ప్రచార సాధనంగా ఎంతగానో ఉపకరిస్తుంది. కుటుంబ నియంత్రణ, రాజకీయ ప్రచారం, సామాజిక సమస్యల నిర్మూలనకు, ప్రజలను విజ్ఞానవంతులు చేయడం వంటి కార్యక్రమాలలో దీన్ని బాగా వాడుతున్నారు.

బుర్రకథల్లో చక్కటి కవిత్వం ఉంటుంది. వినే ప్రతి ఒక్కరినీ కదిలిస్తుంది. బుర్రకథ ప్రేక్షకులు ఎక్కువమంది సామాన్య ప్రజలే. అందుకే కథకులు ఏ కథాంశాన్ని తీసుకున్నా, అప్పటి సమకాలీన పరిస్థితులకు అన్వయించి చెబుతుండేవారు. ప్రజా అభ్యుదయాన్ని కోరుకుంటూ, ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేవారు. అయితే పాశ్చాత్య సంస్కృతి మోజులో పడి ఎన్నో కళారూపాలు ఇప్పటికే కాలగర్భంలో కలిసిపోయాయి. సామాజిక ప్రయోజనం మిళితమైన బుర్రకథను ఆ జాబితాలో చేరకుండా కాపాడుకోవాల్సిన అవసరం మనపై ఉన్నది.

శతాబ్దాలుగా రాజులు పోయినా, రాజ్యాలు మారినా జానపద కళలు మాత్రం ప్రజా హృదయాలలో అలాగే నిలిచి ఉన్నాయి. ఎన్ని ఆటుపోటులు వచ్చినా ప్రజలు వాటిని పోషించారు. కళాకారులను కన్న బిడ్డలుగా చూసుకున్నారు. తెలుగుజాతి గర్వించదగిన కళారూపాలవి.

నాటకం, సినిమా, రేడియో, టెలివిజన్, మొబైల్స్, అంతర్జాలం వంటి ఆధునిక ప్రక్రియలు రావడంతో ఈనాడు వాటి పట్ల ఆదరణ తగ్గింది. జానపద కళలను పోషించేవారు తగ్గిపోయారు. కళాకారులు కడుపు నింపుకోవడం కోసం, కళలనే పట్టుకుని దేశ సంచరులుగా తిరుగుతూ, కళా ప్రదర్శనాలను ప్రదర్శిస్తూ, చాలీచాలని ఆదాయాలతో కడుపు నింపుకుంటూ జీవిస్తున్నారు. అలాంటివారిని గుర్తించి కొన ఊపిరితోనున్న ప్రాచీన కళారూపాలను బ్రతికించవలసిన అవసరం అటు ప్రభుత్వం పైన ఇటు ప్రజలపైనా ఉన్నది. వారికి పింఛన్లు, ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలి. నూతన వైభోగం సంతరించుకోవడానికి కళాకారులు, కళాభిమానులు, కళాపోషకులు ప్రతిజ్ఞ చేయాలి.

**ఉపయుక్త గ్రంథాలు:**

తెలుగు జానపద కళారూపాలు. విశ్వవిద్యాలయం, హైదరాబాద్ 1992. -. కళా ప్రపూర్ణ డా. రాధాకృష్ణమూర్తి మిక్కిలినేని తెలుగు
మహతి. - వ్యాస సంకలనం, యువభారతి, సికింద్రాబాద్ 1972.
తెలుగు వాణి. -. ప్రపంచ మహాసభల ప్రత్యేక సంచిక, ఉగాది - 1975.
బొమ్మా రెడ్డి అరుణ - తెలుగు ఇతిహాసం యొక్క కథన సంప్రదాయాలు, పల్నాటి వీరుల కథ, నోషన్ ఛిలీ - 2019.
శ్రీనివాసరావు వేపచేదు - బుర్రకథ, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్, 2002.
ఆచార్య గంగప్ప. ఎస్.. బుర్రకథ సామాజిక ప్రయోజనం, చైతన్య స్రవంతి ప్రత్యేక సంచిక - 2006.
సుందరం ఆర్. వి. ఎస్. -. సుందర జానపదం, తెలుగు- కన్నడ జానపద గేయాలు, మైసూర్ 1979.
గంగాధరం నేదునూరి -. జానపద గేయ వాంగ్మయ వ్యాసావళి, హైదరాబాద్ - 1961.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

సుబ్బారావు తంగిరాల -. జానపద సాహిత్యము వీరగాథలు, 1975.

రామరాజు బిరుదు రాజు తెలుగు జానపద సాహిత్యము, 1958.

ఆదిశేషువు హరి జానపద గేయ వాంగ్మయ పరిచయము, 1954.

డా. కృష్ణకుమారి నాయని తెలుగు జానపద గేయ గాథలు, 13. ఆచార్య దోనప్ప తూమాటి జానపద కళా సంపద, 1975,

తాతయ్య మూల -. తెలుగు భాషా విజ్ఞాన దర్శిని, ఎస్సార్ ప్రింటర్స్, శ్రీకాకుళం, 2018.

ప్రొఫెసర్ సిమ్మన్న వెలమల తెలుగు సాహిత్య చరిత్ర, దళిత సాహిత్య పీఠం, విశాఖపట్నం, 2011.

వ్యాస మంజరి. . శ్రీ ప్రభాకర శాస్త్రి వేటూరి, మనిమంజరి ప్రచురణలు, హైదరాబాద్ 1988.

త్రివేణి. -. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ, హైదరాబాద్ 1960.

ఆంధ్ర సర్వస్వం. . శ్రీ కొండపల్లి ప్రెస్, రాజమహేంద్రవరం 1951.

తెలుగు సాహిత్య చరిత్ర - డాక్టర్. ద్వా.నా. శాస్త్రి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్ - 1998.

తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటం) నాగయ్య జి. నవ్య పరిశోధక ప్రచురణలు, తిరుపతి - 1996.